# శ్యామలాదండకము,
# లలితా దండకము



భావావిష్కరణము

దశిక కృష్ణమోహన్

సంపాదకులు

డా॥ రేమెళ్ళ అవధానులు

శ్రీ వేదభారతి

# విషయసూచిక


| | |
|---|---|
| ఒక్కమాట | 7 |
| శ్రీ శ్యామలాదేవి ప్రార్థన | 16 |
| శ్రీ శ్యామలాదండకము ప్రారంభము | 18 |
| భావావిష్కరణము | 24 |
| సప్తయోగినీ దేవతా ధ్యానశ్లోకాలు | 38 |
| శ్రీ లలితా దండకము | 41 |
| సప్తయోగినీదేవతా స్వరూప వివరణ | 44 |

# ఒక్కమాట

ఇది "శ్యామలా దండకము". నిరక్షరకుక్షి అయిన కాళిదాసు నాలుకపై కాళీమాత బీజాక్షరము వ్రాసిందని, వెంటనే అతడు సకల విద్యా పారంగతుడైనాడని, అనంతరం 'శ్యామలా' దండకాన్ని అనర్గలంగా చెప్పాడని ఒక ఐతిహ్యం ఉన్నది. తన నాలుకపై కాళీమాత బీజాక్షరాలు వ్రాస్తే కాళిదాసు "శ్యామల" ను కీర్తిస్తూ దండకం చెప్పడమేమిటి? మాతంగి ప్రస్తావన ఏమిటి? మాతంగి, కాళిక, శ్యామల – వీరు వేరువేరా? ఒకటేనా? అంటే, మాతంగీ దేవతకు శ్యామలాదేవి అనేది నామాంతరమే కాని వేరుకాదని, కాళిక, మాతంగి, శ్యామల అంతా ఒక్కటే అని తెలిసిన పెద్దలు చెప్పారు. ఒక శ్లోకం ప్రసిద్ధిలో ఉంది –

**"గంగా భవానీ గాయత్రీ కాళీ లక్ష్మీ సరస్వతీ ।**
**రాజరాజేశ్వరీ బాలా శ్యామలా లలితా దశ ॥"** – అని.

పది (దశ) ఏమిటి? ఆమెకు సహస్రాధిక నామములున్నాయి కదా!

ఇక ఈ కాళిదాసు రఘువంశాది కావ్యాలు వ్రాసిన వాడేనా? లేక మరొక కాళిదాసు ఎవరైనా ఉన్నారా? రఘువంశాదులు వ్రాసిన కాళిదాసయితే సంస్కృత సాహిత్య చరిత్ర ప్రకారం కావ్యత్రయం, నాటక త్రయం, ఋతు సంహారం వ్రాసినట్లుగా ప్రసిద్ధి. కాని సాహిత్య జగత్తులో

మరికొన్ని గ్రంథాలు – రాక్షసకావ్యం, శృంగార తిలకం, పుష్పబాణ విలాసం, శృతిబోధ ఇలాంటివి కూడా కాళిదాసే వ్రాసినట్లుగా ప్రచారంలో ఉంది. అసలు కాళిదాసనేవాడు ఒక్కడుకాదు, ఇంకా కొంతమంది అదే పేరుతో ఉన్నారనే వాదన కూడా ఉంది. వీరి కాలాలపై విభిన్నవాదనలూ ఉన్నాయి. సరే, ఇవన్నీ ఇలా ఉంచితే, ప్రస్తుతం ఈ శ్యామలాదండకాన్ని రచించిన కవి మాత్రం మహాకవిగా పేరొందిన కాళిదాసే అని బహుళ ప్రచారంలో ఉంది.

సరే, శ్యామల ఎవరు? శ్యామలాదేవిని వర్ణిస్తూ ఈ దండకం ఎందుకు చెప్పాడు? అంటే – తంత్రశాస్త్రంలోని దశ మహావిద్యలను గూర్చి పెద్దలు చెబుతూ ఉంటారు.

**“కాళీ తారా మహావిద్యా షోడశీ భువనేశ్వరీ**
**భైరవీ ఛిన్నమస్తాచ విద్యా ధూమావతీ తథా।**
**బగళాసిద్ధ విద్యాచ మాతంగీ కమలాత్మికా**
**ఏతా దశ మహావిద్యాః తంత్రశాస్త్రే ప్రకీర్తితాః ॥**

అని “శాక్తప్రమోదం” అనే తంత్ర శాస్త్ర గ్రంథంలో తెలియజేయ బడినది. కనుక దశ మహా విద్యలలో మాతంగి ఒక శక్తి స్వరూపిణి అని తెలుస్తుంది. ‘మతంగ ఏవ మాతంగః (శివః) తస్య పత్నీ మాతంగీ’ అని కొందరు, మతంగ మహర్షి కుమార్తె కనుక మాతంగి అని కొందరు వాదిస్తారు. ఎన్నో శక్తిస్వరూపాలున్నా, అవన్నీ జగన్మాతయొక్క

ఆదిపరాశక్తి యొక్క రూపాంతరాలే. ఆయా ప్రయోజనాలనుద్దేశించి ఆమె ఏర్పచిన, ధరించిన, సృష్టించిన రూపాలే కావున అన్ని శక్తి స్వరూపాలకు మూలము, మాతృక అయిన ఆది పరాశక్తి అభిన్నతను మనం తెలుసుకొనుట ఇక్కడ ప్రధానాంశం.

ఇక ఈ శ్యామలాదేవి యొక్క ఆకారాది విశేషాలేమిటి? అంటే, "బాలా లఘుశ్యామలా మంత్ర కథన తరంగము" అనే గ్రంథంలో

**మాణిక్యాభరణాన్వితాం స్మితముఖీం నీలోత్పలాభాంబరాం**
**రమ్యాం లక్తకలిప్త పాదకమలాం నేత్రత్రయోల్లాసినీమ్ ।**
**వీణావాదన తత్పరాం సురనతాం కీరచ్ఛద శ్యామలాం**
**మాతంగీం శశిశేఖరాం అనుభజేత్ తామ్బూలపూర్ణాననామ్॥**అని

శ్యామలాదేవి వర్ణింపబడింది. అలాగే,

**శ్యామాం శుభ్రాంశుఫాలాం త్రిణయనకమలాం రత్నసింహాసనస్థాం**
**భక్తాభీష్ట ప్రదాత్రీం సురనికర కరాసేవ్య కంజాంఘ్రియుగ్మామ్ ।**
**నీలాంభోజాంశు కాంతిం నిశిచర నికరారణ్య దావాగ్నిరూపాం**
**పాశం ఖడ్గం చతుర్భిః వరకమలకరైః ఖేటకం చాంకుశం చ**
**మాతంగీమావహన్తీం అభిమతఫలదాం మోదినీం చిన్తయామి ॥**

అని శాక్తప్రమోద తంత్ర శాస్త్ర గ్రంథంలో వివరింపబడింది. మాతంగీ దేవతకు ఈ 'శ్యామల' పర్యాయపదమని "మాతంగీ గాయత్రీ" మంత్రమును బట్టి కూడా తెలియుచున్నది. అందువల్లనే కవి ఈ

రెండు పదములను కూడా దండకమున ఏకార్థకములుగ ఉపయోగించాడు. ఈ దండకంలో ఎక్కడా 'కాళికే' అను పదము లేకుండుట గమనింపతగినది.

గమనిక - అయితే కాలక్రమేణ ఇందనేకపాఠాంతరము లేర్పడియున్నవి. కొన్ని మార్పులు చేర్పులు చేయబడ్డాయి. మరికొన్ని పదములు, సమాసములు అధికముగా కన్పట్టుచున్నవి. నేను గ్రహించిన ప్రతి 1918 నాటిది. వావిళ్ళ వారిది. కృతజ్ఞతలు.

ఇక మాతంగికి సంబంధించిన మరికొన్ని విషయములు -

గీతాప్రెస్ - గోరఖ్‌పూర్ వారు హిందీలో ప్రచురించిన 'దశమహావిద్యాయే' అనుదానికి అనువాదముగావించి, తెలుగున 'దశ మహావిద్యలు' అను పుస్తకమును ప్రచురించిన భాగవత మాదిరి నిర్వాహకులు, కీ॥శే॥ పురాణ పండ రాధాకృష్ణ మూర్తి గారు (రాజమండ్రి) మాతంగిని గురించి అనువదించిన విషయం పాఠక జిజ్ఞాసువుల ముందుంచుతున్నాను.

"శివునకు మతంగ నామమ్మునది. మాతంగీ ధ్యానంలో ఈమె శ్యామల వర్ణ అనీ, మస్తకోపరిభాగాన చంద్రుని ధరించినదని, త్రినేత్రి అని, రత్నమయ సింహాసనాసీనురాలని, రాక్షస సమూహరూప అరణ్యాన్ని భస్మం చేయడంలో, నీలకమల సమకాంతి కలదియని, దావానల సమానయని, తన చతుర్భుజాలతో పాశాంకుశ ఖడ్గ ఖేటకాలను

ధరించినదని, అసురులను మోహింపజేయునదియై భక్తులకు అభీష్టవరాలను ప్రసాదించునదియై విరాజిల్లుతూ ఉంటుందని వర్ణించబడి ఉంది. గృహస్థ జీవనాన్ని సుఖవంతం చేసి, పురుషార్థాలను సిద్ధింపజేస్తూ ఉండే ఈ మహావిద్యను ఉపాసిస్తే సాధకుడు వాగ్విలాసపారంగతుడవుతాడని వర్ణించబడి ఉన్నది. మహావిద్యలలో ఈమె నవమస్థానంలో పరిగణించబడినది.

నారదపాంచరాత్రాగమంలో శివుని చండాలునిగాను, తచ్ఛక్తిని ఉచ్ఛిష్ట చండాలినిగాను వర్ణింపబడి ఉన్నది. ఈమె వేరే మాతంగి. పురాతనకాలంలో మతంగ నామక ఋషి నానావృక్ష పరిపూర్ణమయిన కదంబవనంలో జీవులన్నిటిని వశం చేసుకోవాలన్న కోరికతో త్రిపురాదేవి ప్రసన్నార్థం కఠోరమయిన తపస్సుచేశాడు. తత్సమయంలో త్రిపురనేత్రోత్పన్న తేజస్సు నుండి శ్యామలవర్ణంతో ఓ నారీమూర్తి ప్రాదుర్భవించింది. ఈమెనే రాజమాతంగిని అన్నారు. (బహుశః ఈమెయే ''రాజశ్యామల'' అయ్యుండవచ్చు) ఈమె దక్షిణ పశ్చిమామ్నాయాలు రెంటికి దేవత. రాజమాతంగి, సుముఖి దృశ్యమాతంగి, కర్ణమాతంగి అని ఈమెకీ నామాంతరాలున్నాయి. మాతంగి యొక్క భైరవునకు మతంగుడు అని పేరు. బ్రహ్మయామళంలో ఈమెను 'మతంగమునికన్య' అన్నారు.

దశమహావిద్యలలో మాతంగీ మహావిద్యోపాసన వాక్సిద్ధ్యర్థం జరుగుతూ ఉంటుంది. పునశ్చర్యార్ణవంలో ఇలా చెప్పబడినది –

**అథ వక్ష్యే మహాదేవీం మాతంగీం సర్వసిద్ధిదాం ।**
**అస్యాః సేవన మాత్రేణ వాక్సిద్ధిం లభతే ధ్రువమ్ ॥**

మాతంగి యొక్క స్థూల రూపాత్మక ప్రతీక విధానాన్ని తిలకిస్తూ ఉంటే ఈమె వాగ్దేవతామూర్తియే అని చక్కగా తెలుస్తుంది. మాతంగి యొక్క శ్యామవర్ణం పరావాక్ బిందువై భాసిల్లుతూ ఉంటుంది. సూర్యసోమాగ్నులే ఆమె త్రినయనాలు. ఆమె చతుర్భుజాలు చతుర్వేదాలు. పాశం అవిద్య. అంకుశం విద్య. కర్మరాశి దండం కాగా శబ్ద స్పర్శాది గుణాలు, కృపాణం. అంటే పంచభూతాత్మక సృష్టికి ప్రతీకలు, కదంబవనం బ్రహ్మాండానికి ప్రతీక. యోగి రాజోపనిషత్తులో బ్రహ్మలోకం కదంబగోళాకారంగా వర్ణించబడినది "కదంబగోళాకారం బ్రహ్మలోకం వ్రజన్తి తే" అని. మాతంగీ దేవి సింహాసనం శివాత్మకమయిన మహా మంచ లేద త్రికోణమైయున్నది. ఆమె మూర్తి సూక్ష్మరూపంలో యంత్రంకాగా పరరూపంలో భావనామాత్రమే.

దుర్గాసప్తశతి సప్తమాధ్యాయంలో మాతంగీ దేవిధ్యానం ఇలా ఉన్నది. ఆమె రత్నమయ సింహాసనాసీనయై ఉండి, పఠనం చేస్తున్న శుక మధుర శబ్దాలను ఆలకిస్తూ ఉన్నది. ఆమె శ్యామవర్ణ శరీరయై తన ఒక పాదాన్ని కమలంపై ఉంచింది. మస్తకంపై అర్ధచంద్రుని, గళసీమలో కల్హారపుష్పమాలను ధరించినది. వీణావాదనం చేస్తున్న మాతంగీదేవి బిగిగా ఉన్న రవికను ధరించి శోభిల్లుతూ ఉన్నది.

అరుణ వర్ణాంబరాన్ని ధరించిన ఆమె శంఖమయ పాత్రను ధరించింది. ఆమె వదనంపై మధు ప్రభావం అల్పాల్పంగా ఉంది. లలాట సీమలో తిలకం భాసిల్లుతూ ఉన్నది. ఆమె వల్లకీ ధారణ నాదానికి ప్రతీక. శుకాలాపన చేయడం 'హ్రీం' వర్ణోచ్చారణ చేయడమే. అది బీజాక్షరానికి ప్రతీకయే. కమలం వర్ణాత్మక సృష్టికి ప్రతీక. శంఖపాత్ర బ్రహ్మరంధ్రం కాగా, మధువు అమృతానికి ప్రతీక. రక్త వస్త్రం అగ్ని లేదా జ్ఞానానికి ప్రతీక. వాగ్దేవి అర్థంలో, మాతంగి వ్యాకరణ రూపిణి అయితే, శుకం విద్యకు ప్రతీక అవుతున్నది. చతుర్భుజాలు చతుర్వేదాలై తేజరిల్లుతున్నాయి. ఈ రీతిగా తాంత్రికుల భగవతి అయిన మాతంగీ మహావిద్య వైదికుల సరస్వతి. తంత్రశాస్త్ర గ్రంథాలలో ఈ మహా విద్యోపాసన గురించి విస్తృతమయిన వర్ణన లభిస్తూ ఉన్నది.

కాబట్టి ఈ ప్రస్తావన వలన శ్యామలా స్వరూపము. ఆరాధనా ఫలితము, మొదలయిన విషయాలు గ్రహించాము కదా! మరొక విషయం. ఈ శ్యామలా దండకం చదువుతూంటే, జాగ్రత్తగా ఆలోచిస్తే ప్రతి పదంలో శ్రీ లలితా సహస్రనామస్తోత్రం యొక్క ప్రభావం అణువణువున సుస్పష్టంగా గోచరిస్తూనే ఉంటుంది. దీన్ని ప్రత్యేకంగా వివరిస్తే ఇదే ఒక పెద్ద గ్రంథమవుతుంది. కావున పాఠక మహాశయులు శ్యామలా దండకం చదువుతూనే, దాని భావం గ్రహిస్తున్నప్పుడు, లలితా సహస్రంలోని అమ్మవారి విశేష రూప వర్ణన, గుణవర్ణన, అమ్మనారాధించి ఆమె కరుణకు ఎలా పాత్రులమవుతాము అనేది

చక్కగా సమన్వయం చేసుకొంటూ తత్స్మరణతో చదివితే మరింత విజ్ఞానప్రదంగాను, ఆహ్లాదకరంగాను ఉంటుందని మనవి చేస్తున్నాను. అట్లే జగన్మాత 'అకారాది క్షకారాంత పంచాశత్ (మాతృకా) వర్ణ రూపిణి' కదా! సంస్కృతభాషలో ఏబది అక్షరాలను, అమ్మ సృష్టించిన తన రూపాలే అయిన లాకిన్యాది సప్తయోగినీ దేవతలకు ఏవేవి వర్తిస్తాయో ఆ యోగినీ దేవతల వివరాలన్నీ లలితా సహస్రనామ స్తోత్రంలోని 475వ నామం నుండి 535వ నామం వరకు సవిస్తరముగా వివరింపబడినాయి.

అట్లే ఆయా యోగినీదేవతలకు ప్రత్యేక ప్రార్థన శ్లోకాలు కూడా ఉన్నవి. వీటినన్నింటిని ఒక పట్టికలా తయారుచేసి ఈ శ్యామలా దండక తాత్పర్య వివరణ చివర అనుబంధంగా పొందుపరచడమయినది. ఆసక్తి ఉన్నవారు ప్రత్యేక పరిశీలనలో లలితా సహస్రమునందలి ఈ విశేషములను గ్రహింపగలరు.

ఆస్తిక పాఠక మహాశయులందరికి 'దేవీభాగవతం' కూడా ఒక ఆరాధ్య గ్రంథం కదా! దానిని తెలుగులో పద్యాలలో వ్రాసిన వారిలో శ్రీ ములుగు పాపయారాధ్యులవారు సుప్రసిద్ధులు. అద్భుత మయిన రచన. వారు తమ దేవీ భాగవతమునందు రచించిన **"లలితా దండకమును"** కూడా ఇందు చేర్చుట జరిగినది. పాఠకులు చదివి ఆనందపరవశులగుదురు గాక! జగన్మాత ఆశీస్సులకు, అనుగ్రహమునకు పాత్రులగుదురు గాక!

శ్యామలాదండకమునకు ఇట్టి రూపు తెచ్చుటకు నన్ను ప్రోత్సహించి ఆశీస్సులందించిన పూజ్యులు, వేదగణితమును విశేషముగా పరిశోధించి టి.వి. శ్రోతలకు విశేష ఆసక్తి కలుగజేసి, వేదశాస్త్రాలపై నిరంతర విశేష పరిశీలన, పరిశోధన చేయుచున్న, శ్రీ వేదభారతి వ్యవస్థాపకులు, "వాచస్పతి", "సంస్కృతమిత్ర" బ్రహ్మశ్రీ రేమెళ్ళ అవధానులు గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. వీరిని నాకు ఫోన్‌లో పరిచయం గావించిన బ్రహ్మశ్రీ తంగిరాల వెంకట సుబ్బారావు (రిటైర్డ్ ప్రొఫెసర్–వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ కృష్ణదేవరాయ రసజ్ఞ సమాఖ్య - బెంగుళూరు) గారికి నా హృదయపూర్వక ధన్యవాదములు. శ్రీ అవధానులుగారి సూచనద్వారా ఈ దండక తాత్పర్యావిష్కరణమునకు నన్నునుగ్రహించిన జగన్మాతకు, శ్యామలాదండక రచయిత మహాకవి కాళిదాసునకు కూడా నేను సర్వదా కృతజ్ఞుడనని మనవి చేయుచున్నాను.

పాఠకోత్తములారా! ఇక మీ వంతు!

భావావిష్కర్త

**దశిక కృష్ణమోహన్**

నరసాపురం

14-07-2015